
విషవలయం
(నాటిక)
వేక్షపల్లి

**పాత్రలు :**

1. శేఖర్‌బాబు: హోదాగల వ్యక్తి. హైసొసైటీలోకి ప్రాకాలనే తాపత్రయంగల వ్యక్తి. వయస్సు 30 సం.లు.

2. రవి: ప్రమోదరావు ఆఫీసులో గుమాస్తా, రచయిత కూడాను, వయస్సు 30 సం.లు.

3. ప్రమోదరావు: లంచాలు మింగే ఆఫీసరు, వయస్సు 50 సం.లు.

4. భజగోవిందం: 'కాకా' పట్టే [ప్రమోదరావు ఆఫీసులోని] గుమాస్తా, వయస్సు 45 సం.లు.

5. శోభనాద్రి: ప్రమోదరావు స్నేహితుడు, లారీల ఓనరు. అప్పుడప్పుడూ ఎన్నికలలో నిలబడే రాజకీయ నాయకుడు. వయస్సు 45 సం.లు.

6. గోపీనాథ్: ప్రమోదరావు కొడుకు. సినిమా తియ్యాలనే పిచ్చి. వయస్సు 25 సంవత్సరాలు.

( తెర తీవగానే )

[ప్రమోదరావు యిల్లు. అధునాతనంగా అలంకరింపబడిన హాలు. ఎడమచేతివైపున వీధిలోకి ద్వారం. హాలు వెనుకవైపు మధ్యనుంచి మేడమీదకు రెండువైపులనుంచీ మెట్లు. కుడివైపుకి వెళ్ళే మెట్లక్రింద టెలిఫోన్. కుడిప్రక్కముందు వైపు యింటిలోపలికి దారి. సోఫా ఆడియన్సుకు ఫేస్ చేసి వుంటుంది. దాని యెదురుగా ఒక చిన్నసైజు టేబిలు. టేబిలుకు అటూయిటూ రెండు చిన్నసోఫా సైజు కుర్చీలు. ఎడమవైపుకు వెళ్ళే మెట్ల క్రిందనున్న టేబిలుమీద పెద్దసైజు బుద్ధుడు బొమ్మ. గోడలకు నెహ్రూ, గాంధీ ఫోటోలుంటయ్. తెరతీయగానే ప్రమోదరావు మెట్లమీదనుంచి పేపరు చదువుతూ క్రిందికి దిగివస్తాడు. టెలిఫోను దగ్గర పేపరువడేసి ఒక నంబరు డయల్చేస్తాడు.]

ప్రమో : ఎవరూ? శోభనాద్రేనా?... ఆఁ నేను...ప్రమోదరావుని మాట్లాడేది. ఆఁ...విశేషాల్చెప్పేందుకే పిలిచింది మరి... అన్నట్టు నీ పక్క నెవరన్నా వున్నారా? లేరూ ... సరిగాచూడు ... నీతో వేధవగొడవ...నేనన్న మాటలన్నీ నాకే ఫోన్లో అప్పచెపుతూ వుంటావ్...నీమొహంగానీ... ఆఁ... నేనిప్పుడు చెప్పబోయేదంతా నోరు మూసుకుని విను...యింతకీ విశేషం ఏమిటంటే యివ్వాళ మనం ఒక బ్రహ్మాండమైన వ్యక్తిని కలుసుకోబోతున్నాం... ఆయనో లక్షాధికారి. రెండురోజుల క్రితం క్లబ్బులో పరిచయం చేసుకున్నాను. నగంలో ఆపేసిన మన వ్యాపారాన్ని ఒక దారికి తేగల్గింవాయనేనని నాకు నమ్మకం కలిగింది...ష్...నోరు మూసుకుని విను... ఇంకాస్సేపట్లో ఆయన మాయింటికొస్తున్నారు. నువ్వుకూడా యిక్కడికొచ్చెయ్. వెంటనేరా...ష్...ఏం మాట్లాడకు...వివరాలన్నీ యిక్కడ మాట్లాడకుందాం [ఇంతలో భజగోవిందం వస్తాడు. ఫోన్లో మాట్లాడుతూ ప్రమోదరావు తనవైపుకు చూడంగనే దండంపెడుతూ వుంటాడు. ఇలా రెండు మూడ్సార్లు జరుగుతుంది.]

సరే...వెంటనేరా [అంటూ ప్రమోదరావు ఫోన్‌క్రింద పెట్టంగానే భజగోవిందం మళ్ళీ దండం పెడ్తాడు. ప్రమోదరావు ఈ దండంకూడా చూడకుండా స్టేజి మధ్యలోకొచ్చి సోఫాలో కూర్చుంటాడు. కూర్చుని రిలాక్సింగు మూడ్‌లోకివచ్చి తనచుట్టూ పేపర్‌కోసం వెదికి, పేపర్ని ఫోన్‌దగ్గర పెట్టటం గుర్తుకొచ్చి ఫోన్ వైపు చూసి...]

ప్రమో: భజగోవిందం! ఆ పేపరిట్తే...

[భజగోవిందం ఫైలు టేబిలమీద పెట్టి పరుగెత్తుకెళ్ళి పేపరీసుకొచ్చి రెండుచేతుల్తోనూ పట్టుకుని ప్రమోదరావు కిస్తాడు. ప్రమోదరావు పేపర్చదువుతూ తాపీగా...]

ఆఁ...ఏమిటోయ్ కబుర్లు?

భజ : ప్రపంచం ... చుచుచు... ఎంత పాడయి పోయిందండి!? అన్య ... నాయణా' అంటే బూతుమాట. నలుగుర్తో మంచిగా వుంటూ కాలం గడుపుకునే వాళ్ళకి రోజులు కావండి...దీంతస్సదియ్య ప్రపంచం ...చు...చు...పాడయి పోయిందండి.

ప్రమో : ఏమిటోయ్? ఏం జరిగింది?

భజ : జరిగేందుకింకేం వుందండి?!... ఈ ప్రపంచం యెప్పుడోనే పాడయి పోయింది అయ్యా! ఆయనెవరో...ఆయనెవరో ఏమన్నాడండి?... ఉపకారికి నుపకారము విపరీతము గాదు సేయ వివరింపంగాన్...అని అన్నాడాండీ!? దానర్థం ఈ ప్రపంచానికి తెల్సా? మేలుచేసినవాడికి మనం చెయ్యగలిగితే తిరిగి మేలుచెయ్యాలి. అలా చెయ్యటంలో పెద్దగా చెప్పుకో వల్సిందేమీలేదనే గదండి దానర్థం. అలా తిరిగి మేలు చెయ్యలేని నాబోటి అల్పులు ఆ జన్మాంతర కృతజ్ఞతన్నా చూపించాలి. అది కనీసధర్మం కదండీ. కానీ అలాచేస్తే ఈ ప్రపంచానికి గిట్టదండి. అలా కృతజ్ఞత చూపిస్తే ఏమిటేమిటో...ఏమిటేమిటో అనేస్తుంది సార్ ఈ ప్రపంచం ... ఏం ప్రపంచంసార్...చుచు...పాడయిపోయింది. ఇవ్వాళ నేం చెపుతున్నాను గుర్తుంచుకోండి సార్—ఇవ్వాళ మీదగ్గర నిలబడి చేతులు కట్టుకుని చెపుతున్నాను గుర్తుంచుకోండి... ఈ ప్రపంచం (ఏదో అవబోయి)...ఎందుకు లెండి! చూస్తూ వుండండి నాశనం—నాశనం— అయిపోతుంది... ప్రపంచం... ప్చ్‌ప్చ్ ... పాడయి పోయిందిసార్.

ప్రమో : ఒరి నీ ప్రపంచం నువ్వూ నాశనంగానూ! సంగతెప్పకుండా యేమిటోయ్ నీగోల?

భజ : అదే చెప్తున్నానండీ! విశ్వాసం చూపించే నాబోటివాణ్ణి కుక్కగాచూసి గౌరవించాల్సిందిపోయి యిలా వెధవ కింద కట్టేస్తుందాండీ ఈ ప్రపంచం...వాడు వాడండీ... ఆ రవిగాడు...కవిగాడుట! ఎంతెంత మాటలన్నాడండి? యింకా పైగా కవిత్వంలో తిట్టాడండీ ... బోడిముండా కవిత్వం వాడూనూ!... తిట్టటానికీ, కొట్టటానికీ కూడా కవిత్వంట!!...వెధవ ముండా కవిత్వం పిడగానూ! అంతగా కవిత్వం అఘోరిద్దామనుకుంటే యెవడికన్నా సన్మానపత్రం రాసి పెట్టొచ్చుగా, బోల్డుమంది డబ్బులిచ్చి సన్మానాలు చేయించుకుంటున్నారుకూడాను...అదీలేదు ...వీడి కవిత్వం నామీద చూపిస్తున్నాడండి.

ప్రమో: ఇంతకూ ఏమంటాడోయ్ వాడు?

భజ: అంటె వూరుకుంటానా సార్ ?...వీడి బోడిముండా కవిత్వం నాకు రాక్కపోవచ్చు గానీ అంటే వూరుకుంటానా? ...యింతకు పూర్వం యేదోలే కుర్రవెధవ అని వూరుకున్నమాట నిజమే ననుకోండి. కానీ యిప్పుడు నాలుగూ దులిపేస్తున్నాన్సార్...వాడు అన్న నాలుగు మాటల్నీ యిట్లా యిట్లా వాడి ముందే దులిపేస్తున్నాన్సార్ (అంటూ తన చొక్కా మీద దుమ్ము చేత్తో దులుపుతాడు). ఇట్లా దులిపేస్తున్నానని వెధవకింకేం చెయ్యటం చేతగాక అనటం మానేసి రాయటం మొదలెట్టాడు. నిన్నండి...నిన్న...యీ కాగితం నామొహాన విసిరిపోయాడండి (అంటూ జేబులోంచి ఒక కాగితం తీస్తాడు).

ప్రమో: ఏం రాశాడోయ్ దాంట్లో...

భజ: ఏవో లెండి (అని కాగితం జేబులో పెట్టుకుంటాడు)...అహా...ఇప్పట్రాయం గానే అయిపోయిందిటండి ? రేపొద్దున్న మీరు నాకు ప్రమోషనిచ్చి వాణ్ణి తొక్కిపట్టి ఆ సీట్లోనేవుంచి వాణ్ణెత్తిన

యిన్నిన్ని...యిన్నిన్ని...ఫైళ్ళు కొడ్తార్లే అప్పుడు...అప్పుడు తెలిసొస్తుంది వాడికి ...సార్...ఆ పై పోస్టు నాకిచ్చి పుణ్యం కట్టుకోండి సార్...

ప్రమో: అది చూద్దాం గానీ...ముందా కాగితంలో ఏం రాశాడో చెప్పు...

భజ: ఏదో లెండి. (నసుగుతాడు)

ప్రమో: తియ్యవయ్యా జేబులోంచి...

భజ: తప్పదంటారా? (అని మెల్లగా కాగితాన్ని తీసి) దీన్ని చూస్తుంటే నాకు అరికాలిమంట నెత్తి కెక్కుతోందండీ... దొంగ వెధవ...వెధవముండా కవిత్వం పిడాను...ఏం రాశాడో చూడండి—

'చెప్పు కొరకు తిరుగు శునకమ్మ
మెప్పు కొరకు తిరుగు భజగోవిందమ్మ'

మీరు దయతో చేస్తున్న సహాయానికి కృతజ్ఞత చూపిస్తానికి మీ యింటిచుట్టూ తిరగటం నేం చేసిన తప్పండీ? అందు కనిలా రాస్తాడా? ఒరేయ్ రవీ! అవున్రా ...నేను కుక్కని, ప్రమోదరావుగారికో వందస్లతడవలు రోజుకు దండం పెడ్తాను ...పెడ్తాన్రా...అయన్లాంటి ధర్మాత్ముల కోసం గదుట్రా అసలు యీ 'దండం' అనే పదాన్ని సృష్టించింది, విశ్వాసం అంటే అర్థం తెలియని వెధవా?

ప్రమో: [కాగితాన్ని చూసి నవ్వుతూ] మొత్తానికి బాగానే రాశాడోయ్!

భజ: అవున్సార్! ఆఁ...ఏవిటి సార్ బాగా రాసింది? నా గురించా? మీరూ

# విషవలయం

అదే మాటంటున్నారా?

ప్రమో: (నవ్వుతూ) నీ గురించి కాదోయ్...కవిత్వం బాగానే రాశాడంటు న్నాను.

భజ: ఏం కవిత్వం లెండి? బోడిముండా కవిత్వం.........నన్నంటె అన్నాడ్సార్... మిమ్మల్ని...మిమ్మల్నెంత మాటన్నా డండి? పైగా అందర్తోనూ అనేస్తు న్నాడు. ప్రపంచం...చు...చు ... పాడయి పోయిందండి... మిమ్మల్నెంతెంత మాటన్నాడూ?' అవ్వ!!

ప్రమో: నీ వెధవ వుపోద్ఘాతంతో చంపక, త్వరగా చెప్పు ఏమన్నాడో...

భజ: 'వాడేమన్నాడంటేనండి... మీరు లంచాలకి లంచాలు మింగేస్తార్ట. ఏ కాగితా న్నయినాసరే లంచం ముట్టందే ముట్టనే ముట్టర్ట ... పైగా దాన్ని తొక్కి పడ్తార్ట...ఇలా ఏమేమేవిటో అన్నాడండి.

ప్రమో: అహాఁ...అయితే ఆ రవిగాడి వ్యవహారం అంతవరకూ వచ్చిందన్నమాట. 'ఏదో కుర్రకుంక కొత్తగా చేరాడు, పోనీ లే' అని వూరుకుంటున్నా నింతవరకూ. అయితే వీణ్ణి నొక్కి పారెయ్యాల్సిందే, ప్రమోదరావుని విమర్శించిన ఏ గుమాస్తా గాడు పైకి రాలేదు. వీడికి తగిన బుద్ధి చెపుతాను.

(గోపీనాథ్ బయటినుంచి వస్తాడు)

గోపీ: నాన్నా! ఎవరికి బుద్ధి చెపుతా నంటున్నావ్. భజగోవిందానికా!? అబ్బే, వీడికి బుద్ధి రాదు నాన్నా...వీడింతే.

ప్రమో: ఏంరా బలాదూర్ వెధవా? ఊరిమీద తిరుగుడయ్యిందా?

గోపీ: తిరుగుడు కాదు నాన్నా...కొత్త ముఖాలకోసం వేట. నేను తీసే సినిమాలో కొన్ని కొత్త ముఖాలకి అవకాశం యిద్దా మనుకుంటున్నాను... మీ రిద్దరూ నా పిక్చర్లో విలన్లు...నాన్నా! అన్నట్టు సినిమా తీసేందుకు డబ్బు రడీ చేశావా?

ప్రమో: ఛ...వెధవా! నీకు సినిమా తీసేందుక్కాదు గదా చూసేందుక్కూడా యివ్వను.

గోపీ: ఆఁ...యివ్వవ్. మరి ఆ లంచం డబ్బులన్నీ యేం చేద్దాం నాన్నా? దానికి తోడు ఆ మూల గదిలో పెట్టెనిండా డబ్బుల్దాచావ్? పోనీ అందులోంచయినా యివ్వు నాన్నా!

ప్రమో: ఛీ...దరిద్రుడా...ఆ డబ్బు సంగతి మాట్లాడకు (అంటూ విసుగ్గా లోపలికెడ్తాడు)

గోపీ: మా నాన్న ఆ పెట్టెలో డబ్బు గురించి మాట్లాడితే చాలు, ఆ చుట్టు పక్కలుండడు. అదంతా బ్లాక్ మనీ-యూ? ...[భజగోవిందం వైపు తిరిగి] భజగోవిందం ఆ డబ్బు గురించి నీకు తెల్సా?

భజ: 'బాబ్బాబు! (వన్నడక్కండి' అన్నట్టు మొహం పెడ్తాడు).

గోపీ: ఆఁ...భజగోవిందం! యివ్వాళ మా నాన్న చుట్టూ భజన్చేసి గోవిందలు కొట్టావా? ఏదీ యింకొక్కతడవ చెయ్యి.

[భజగోవిందాన్ని కవ్వించేసరికి భజ గోవిందం ముందు, వెనకాల గోపీనాథ్ కుర్చీ చుట్టూ పరుగెత్తుతాడు]

గోపీ: ప్రమోదరావు చుట్టూ తిరిగి భజన్చేస్తే ప్రమోషనొస్తుంది. నీకు తెల్సుగా? నాకు తెలియకేం ... నువ్వసలే కాకాసురుడివి, కాకాసురా ది గ్రేట్‌వి...

భజ: ఏం మాటలవి గోపీగారు...ఆఁ ...మీరిట్లా తిరుగుతూ నాన్నగార్ని బాధ పెట్టొచ్చా? ఎందుకు మీకీ సినిమా పిచ్చి? ఇంకా సినిమా తియ్యాలనే పిచ్చి పోలేదా?

గోపీ: ఎట్లా పోతుంది? ఇంకా ఒక పిక్చరయినా తియ్యందే...ఆఁ (టేబిలు మీదున్న ఫైలు తెరచి) యిదేవిటి?



మీ ఆఫీసు కాగితం కాదూ?

భజ : అవునండి.

గోపీ : (డిటెక్టివ్ పోజులో) ఎట్లా కనుక్కున్నానో చెప్పు?

భజ : మీరే చెప్పండి...

గోపీ : చెప్పుతాను భజగోవిందం... ఇదిగో చెప్పు...యిటువేపు నీ కాలి చెప్పు గుర్తు...యిటువేపున మానాన్న కాలి బూటు గుర్తు. లంచం వచ్చేంతవరకూ యీ కాగితాన్ని తొక్కిపట్టుంచారు మీ యిద్దరూ. అందుకే యీ గుర్తులు పడ్డయ్. కాకాసురా! మీ యిద్దరిమీద సినిమాతీసిపారేస్తాను. ఇప్పుడే రవిదగ్గర కెళ్ళి యీ 'కాగితం' ప్లాటుమీద కథ రాయమంటాను. (లోపలికి చూస్తూ) నాన్నా! నీ కథే తీస్తాను; డబ్బు సిద్ధం చెయ్యి; వస్తాను (బయటకు పోతాడు).

(ప్రమోదరావు ప్రవేశం)

ప్రమో : ఏడీ యీ వెధవ! వెళ్ళిపోయాడా? వీడితో నాకు మనశ్శాంతి లేకుండా పోతోందోయ్ [అంటూ కుర్చీలో కూలబడతాడు].

భజ : ఆఁ... ఏదో యింకా చిన్నతనం కదండీ... [ఆవలించి] నిద్దరొస్తోంది. యిహ ఆఫీసు కెడ్తానండి.

ప్రమో : సరే ... పో...ఆఁ ... భజగోవిందం? కాస్సేపాగి మళ్ళీ యిక్కడకు రా...నీతో పనుంది...

భజం : చిత్తం...అలాగేనండి [భజగోవిందం ఫైలుతీసుకుని బయటకు వెళుతూవుండగా శోభనాద్రి ప్రవేశిస్తాడు. భజగోవిందం శోభనాద్రికి దండం పెడ్తాడు. శోభనాద్రి భజగోవిందం వీపుమీద ఒక దెబ్బకొట్టి — 'భజగోవిందం! భజగోవిందం! గోవిందంభజ మూఢమతే!' అంటూ సోఫాదగ్గర కొస్తాడు]

ప్రమో : శోభనాద్రీ! రా. రా...

[శోభనాద్రి సోఫాలో కూర్చుంటాడు]

శోభ : ఏం ప్రమోదం! ఆయనొచ్చాడా?...అదేదో ముతక సామెత చెప్పినట్టు మొత్తానికి నువ్వా సంగతి పోన్లే చెప్పనేలేదు...ఆయన పేరేంటింతకూ...

ప్రమో : ఆయన పేరు శేఖర్‌బాబు... దేశం మొత్తంమీద ఆయనకు బోల్డు వ్యాపారాలున్నయ్; అలాంటివాడు మనకి బాగా పనికొస్తాడు గదూ? అందుకే మొన్న క్లబ్బులో పట్టుకున్నాను [చేతివాచీ వంక చూసి] వచ్చేస్తూ వుంటాడీపాటికి.

శోభ : అయితే యిప్పుడే అన్నీ మాట్లాడేద్దామా?...నా లారీల్ని మన సరుకుని తీసికెళ్ళేందుకుంచేత్తాను. అయిప్పుడు అయిదరాబాదెళ్ళ బోతన్నయ్.

ప్రమో : అబ్బే...అవన్నీ యిప్పుడు కాదు; తర్వాత...యిప్పుడు నిన్నాయనకి పరిచయం చేస్తాను.

శోభ : (నవ్వి) అఁ...నువ్వేంటి పరిచయం చేసేదాయన్ని ... ఆయన్ని నేను క్లబ్బులో చూసేశాను; నువ్వు పరిచయం సేసేతేంటి? !... అదేదో ముతక సామెత చెప్పినట్టు ముండామోసిన మూడేళ్ళకి...

ప్రమో : అబ్బబ్బ! శోభనాద్రీ! నీ ముతక సామెతలాగలెయ్యి...అవిప్పుడు చెప్పకు.

శోభ : ఒయ్! నీకు తెల్దులే ప్రమోదం! ముతక సామెతల్చెప్పకబోతే అందరూ మనం మెతకోళ్ళ మనుకుంటారు...అఁ యింతకూ ఆయన్నాకెట్టా పరిచయం అయ్యాడని అడగవేం?

ప్రమో : ఆఁ ... ఎట్టా పరిచయం అయ్యాడు?


శోభ : ఆఁ...అట్టా అడుగు సెబుతా. ఏంలేదు, ఆయాల క్లబ్బులో వుపన్యాసం యిత్తన్నాడు. పిల్లాడు పీసులావున్నా చాకులా మాట్లాడేత్తన్నాడు. కానీ మైకు దగ్గర నిలబడి మాట్లాడ్డే నాయాలు! ఆటూ యిటూ తిరుగుతూ మాట్లాడ్తన్నాడు. అహా ... నాకు తెలియకడుగుతా, వుపన్యాసం అట్టాగేనా యిచ్చేది? గట్టిగా మైకట్టుకుని బల్లగుద్ది సెప్పాలా వద్దా? అహ ... అదేంలేదు నేనెప్పుడుపన్యాసమిచ్చినా గట్టిగా మైకట్టుకుని యిత్తాను అ...మొన్న ఎలక్షన్లో ఏంవయిందో తెల్సా?...ఏవయిందని అడుగవేం అడుగెహ!

ప్రమో : ('పూఫ్' అని) ఆ ఎలక్షన్ల సంగతి నేనడగన్లే...అబ్బబ్బ...కదిలిస్తే వూరుకోవుగదా. అడగమనిచెప్పి మరీ మొదలెడ్తావ్. అపమంటే అపవ్...నాయకుడి లక్షణాలన్నీ వున్నట్టున్నయ్...

శోభ : ఉన్నట్టుండటమేంటి ప్రమోదం? అచ్చు గుద్దినట్టున్నయ్. అసలు అరవయ్యేడెలక్షన్లోనే పైకి...యేదీ... ఆ...ఢిల్లీ కెళ్ళిపోవాల్సినోణ్ణి కదూ? ఖర్మం కలిసిరాక యింకా మునిసిపల్ ఎలక్షన్లలోనే కొట్టుకుంటున్నాను...అ... ఎలక్షన్లలో ఏవయిందో అడగనేలేదు... పోనీ నా క్లబ్బులో ఏం జేశానో మరి అదన్నా అడుగు ... అడుగెహ (అంటూ ప్రమోదరావు వీపుమీద కొడతాడు)

ప్రమో : అడక్కపోయినా నువ్వూరుకుంటావా? చెప్పు.

శోభ : ఆ... అట్టా అడుగు. పిల్లాడు పీసులావున్నాడన్నానా? అటూ యిటూ



తిరిగి మాట్లాడ్తున్నాడు కోటుజేబులో చేతులెట్టుకుని. అదేదీ...ఆ అమెరికానో, రష్యానో ఆ ... పారినో ఎల్తాంటారే... ఆళ్ళు మాట్లాడినట్టు మాట్లాడ్తున్నాడు...మాటలేవో మైకులో యినబట్టల్లేదు. నాకు 'ఛర్' మని కోపవొచ్చింది గబుక్కున లేగిసి నిలబడ్డాను. నిలబడి— 'వోయ్! ఆ మైకు దగ్గర నిలబడి మాట్లాడవొ' అన్నాను ... నాయాలు (నవ్వుతూ) ... అప్పట్నుంచీ అట్టానే మాట్లాడాడు...ఆడికి నే బాగుర్తే...

ప్రమో: వోరి నీపరిచయం తగలెయ్య! ఇదన్నమాట నీ పరిచయం. సరే యిప్పుడు నేనాయన్ని పరిచయం చేసినప్పుడివేమీ మాట్లాడకు...

శో : వో...నే నూరుకుంటా. నేంటి? ఇక్కడకూడా అటూ యిటూ తిరుగుతూ మాట్లాడ్తే—'వోయ్! నీ యెచ్చుమండా... వో చోట నిలబడి మాట్లాడవో' అంటాను; అంటానంతే. నా కియన్నీ అలవాటే...యీ యాపరంలోకీ, మరీ రాజకీయాల్లోకీ దిగక పూర్వం ఏం జేసేవాణ్ణో తెల్సా?...ఏం జేసే వాణ్ణని అడగవేం...

ప్రమో : నేనవేవీ అడగను గానీ నువ్వు నోరు మూసుక్కూర్చో...ఆఁ... ఆయనొస్తున్నారు.

(శేఖర్ బాబు ప్రవేశం. శేఖర్ బాబుని చూచి ప్రమోదరావు లేచి నిలబడతాడు., అతడి తర్వాత శోభనాద్రి కూడా లేస్తాడు.)

# విపవలయం

శేఖర్ : (ప్రవేశిస్తూ) హాల్లో! గుడ్‌మార్నింగ్ జెంటిల్‌మన్!

ప్రమో : గుడ్ మార్నింగ్ సర్! (శేఖర్‌కి షేక్‌హ్యాండిస్తూ) వీరు శోభనాద్రిగారు. రోడ్డు ట్రాన్సుపోర్టు వ్యాపారం...అప్పుడప్పుడూ మున్సిపాలిటీ రాజకీయాల్లోకి కూడా దిగుతూ వుంటారు.

శేఖర్ : (శోభనాద్రికి షేక్‌హ్యాండిస్తూ) గ్లాడ్ టు మీట్యూ. అయితే మా ప్రోడక్ట్సుకి యీ రీజియన్లో ఏజెన్సీ మీ కప్పగించొచ్చన్న మాట... వెరీ గుడ్... నా ప్రాబ్లెమ్ ఒకటి సాల్వయ్యింది.

ప్రమో : అవి ఆయనే అడగాలనుకున్నారు. మీరే చెప్పేశారు. చాలా సంతోషం.

శేఖర్ : ఓ...నే నేదీ ఒకళ్ళు చెప్పేదాకా ఆగను...అదీగాక దీన్ని గురించి మీరు క్లబ్బులో నాకు చెప్పారు గూడాను. పైగా యిందులో ఒకళ్ళ కొకళ్ళు చేసిపెట్టే లాభం ఏమీ లేదు. నాకు ఏజెంట్సు కావాలి (శోభనాద్రి వైపు తిరిగి) మీకు బిజినెస్ కావాలి. అంతే... జస్ట్ బిజినెస్...ఆఁ...అన్నట్టు మీరు రాజకీయనాయకులు కూడానా?

ప్రమో : ఏదో చిన్నసైజు. మునిసిపాల్టీ లెవెలు...

శోభ : ఆ... చిన్న సైజేంటి ప్రమోదం! పెద్ద సైజే (శేఖర్ బాబు వైపు తిరిగి) ఢిల్లీ ఎల్లిపోదామనుకుంటుండాను.


శేఖర్ : వో వెరీగుడ్...నాయకులంటే నాకు చాలా అభిమానం...యింతకూ ఏ పార్టీ మీది?

శోభ : [గట్టిగా నవ్వేస్తూ] ఏం ప్రశ్న యిది...మళ్ళీ వచ్చే ఎన్నికల్దాకా యింకా ఏ పార్టీనో నిర్ణయించుకోలేదు. అదేదో ముతక సామెత చెప్పినట్టు [ప్రమోదరావొంక చూస్తే అతడు కోపంగా చూస్తాడు. అందుకని మధ్యలో ఆపేసి]......అహ...రాజకీయాలు గుర్రప్పందాల్లాంటివి గదండీ...గుర్రప్పందాల్లో ఏ గుర్రం గెలుత్తదనుకుంటే ఆ గుర్రంమీద పందెంగాత్తాం. అట్టానే ఏ పార్టీ గెలుత్తదనుకుంటే ఆ పార్టీ టిక్కెట్టు తీసుకుంటాం., అంతే. వోయ్ ...నీకు...మీకు తెలుసో తెలియదో., ఇంత వరకూ నేను మూడు పార్టీలు మారాను. ...ఏ పార్టీలని అడగరేం... (శేఖర్ బాబు భుజంమీద కొడుతూ) అడుగెహ...

శేఖర్ : (శోభనాద్రివంక నిర్లక్ష్యంగా చూచి, అతడు కొట్టినచోట సిగరెట్టు పొగ వదలి) వో...అక్కర్లేదు. అడిగితేనే గానీ సమాధానం యివ్వరన్న మాట. గుడ్. మీరు తప్పకుండా ఢిల్లీలో వుండాల్సిందే... (టైము చూసుకుని) వో... ఇటీజ్ టైం ఫర్ మి టు టేక్ రెస్టు ...ఐ హేవ్ బీన్ బిజీ ఆల్ ఎలాంగ్ (అని వొళ్ళు విరుచుకుని నిలబడ్డాడు. ఇది చూసి ప్రమోదరావు కుర్చీలోంచి లేస్తాడు. బలవంతంగా శోభనాద్రి కూడా లేస్తాడు.)

ప్రమో : మేం అలా బయట కెళ్తాము...ఆ మేడమీది గది మీకోసం ఏర్పాటు చేశాను. అక్కడ రెస్టు తీసుకోండి ఇవ్వాళ నౌకర్లకు శలవిచ్చాను. మీ సూట్‌కేసు పైన పెట్టమంటారా...

శేఖర్ : వో...అక్కర్లేదు. నేను తీసుకెడతాను (అని సూట్‌కేసు చేతిలోకి తీసుకుంటాడు)



ప్రమో : (మెల్లిగా) అ...నేనో బిజినెస్ సంగతి మీతో మాట్లాడాలన్నాను చూశారూ?

శేఖర్ : ఎస్...ఎస్...అన్నారు.

ప్రమో : దాన్ని గురించి కాస్సేపు మీరు రెస్టు తీసుకున్నాక మాట్లాడ్దాం. మేమలా బయట కెళ్ళొస్తాం.

శేఖర్ : వో. కె. (అంటాడు యిల్లంతా చూస్తూ)

ప్రమో : వస్తాం. (అని శోభనాద్రిని నెట్టుకుంటూ తీసుకుపోతాడు)

శోభ : (స్టేజి ఎడమవైపు చివరకు వెళ్ళింతర్వాత) బలేగా వుందే యవ్వారం ...బాణం వచ్చినట్టొచ్చి మనల్ని బయటకు పంపేత్తన్నాడే...లబేదో ముశక సామెత చెప్పినట్టు...

ప్రమో : ష్...ద (అని శోభనాద్రిని లాక్కెడతాడు).

(శేఖర్ కాస్సేపు యింటిని పరిశీలించి హుషారుగా మేడమెట్లెక్కబోతూ ప్రక్కన ఫోన్ దగ్గిర ఏదో మేగజైన్ చూసి మెట్లుదిగి ఆ మేగజైన్ చూస్తూ వుంటాడు...రవి ఒకచేతిలో ఫైలుతో ప్రవేశం)

రవి : ప్రమోదరావుగారున్నారండీ!

శేఖర్ : (రవి వంక చూడకుండానే) లేడు.

రవి : వారొచ్చాక యీ ఫైలివ్వండి (అంటూ శేఖర్‌కు ఫైలివ్వటానికి ముందుకెడతాడు. శేఖర్ విసురుగా యిటువైపు తిరుగుతూ)

శేఖర్ : నేనెవ్వరో తెలియకుండా ఏమిటీ అడ్డమైన పనులన్నీ పురమాయిస్తున్నావ్? (అని రవిని పూర్తిగా చూసి వో... నువ్వు రవివి కాదూ... ఏం చేస్తున్నావీ వూళ్ళో?

రవి : ప్రమోదరావుగారి ఆఫీసులో క్లార్కుగా వుంటున్నాను...మీకు నాపేరెలా తెల్సు?

శేఖర్: ఓ ... అదా ?...యిందాక నీ గురించి కొంత ప్రమోదరావు చెప్పాల్లే, ఊం...ఆదర్శాలు, నీతి, నిజాయితీఅంటూ చాలా ఆవేశంగా మాట్లాడ్తావట. ఈ ప్రపంచంలో లేని విషయాలపై యెందుకు నీ కంత మోజు ?

రవి : అవును...నీతి, నిజాయితి ... యివన్నీ ఈనాడు ప్రపంచంలో లేని విషయాలే ... ప్రమోదరావులూ శోభనాద్రులూ, భజగోవిందాలూ వుంటే ఈ ప్రపంచంలో నీతి నియమా లెక్కడుంటయ్, ఎట్లావుంటయ్?

శేఖర్ : థాంక్యూ ! నా పేరుకూడా శోభనాద్రీ, ప్రమోదరావుల లిస్టులో చేర్చలేదు.

రవి : మీ పేరు నాకు తెలియదు.

శేఖర్: తెలిస్తే చేరుస్తావన్నమాట. బతికాను, నా పేర్చెప్పానుకాదు. అయినా నా సంగతి తెలియకుండా నన్నుకూడా ఎలా చేరుస్తావ్ ఆ లిస్టులో ...

రవి : వేరే యింకా యేం తెలియాలి ...నీతి, అవినీతి ఒక్కచోట వుండలేవు ...ప్రమోదరావు ప్రక్కన అలాంటి అవినీతిపరులే వుంటారు.

శేఖర్ : ఎప్పుడూ నువ్వు అర్థం లేని విషయాలే మాట్లాడ్తావ్‌లావుందే!? లేకపోతే ఏమిటో 'నీతి—అవినీతి'అంటూ మాట్లాడ్తా వేస్పడూ ! నీ కబుర్లు వింటుంటె నాకో అనుమానం వేస్తోంది. నువ్వు నాటకాల్లోగనీ, సినిమాల్లోగానీ హీరోవేషం వేస్తూ వుండాలి. బహుశ! నాటకాల్లోనే అయ్యుంటుందిలే. ఎందుకంటే సినిమా హీరోకి వీట్నిగురించి ఆలోచించాల్సిన అవసరంగానీ, టైంగానీ వుండదు ... నువ్వు కథలుకూడా రాస్తూ వుండాలి. అందుకే ఈ నీతి—అవినీతుల డయలాగులకి బాగా అలవాటు పడ్డావ్... బ్రదర్ ! ఒకటిమాత్రం గుర్తుంచుకో. యివన్నీ కథల్లోనూ, నాటకాల్లోనూ చెప్పటానికి చాలా బాగుంటయ్, కానీ మన జీవితాల కేమాత్రం వుపయోగపడవ్.

రవి : ఎందుకుపయోగపడవ్? మంచిగా వుండేవాళ్ళు మొదట్లో కొంత బాధ పడ్తారు. మంచితనాని కెప్పుడూ ఈ పరీక్ష ల్తప్పవ్. కానీ చివరకు విజయం మంచివాళ్ళదే...

శేఖర్ : చివరికి...హహ్హాహ్హా... అంటే చచ్చిపోయేముందా బ్రదర్ ! చచ్చేముందెవడు గెలిస్తేనేం ? నీకు దేవుడు మనిషినెందుకు సృష్టించాడో తెల్సా ? చస్తూ బతకమనా ? బాగా బతికి చావమనా ?! మనిషి కెలాగూ చావు తప్పదు. కానీ చచ్చేలోగా బతకాలి. బతకటం అంటే జీవించటం కాదు బ్రదర్ ! జేబుల్నింపటం ! బతికేటప్పుడు జేబుల్నింపుకుని బాగా బతకాలి. ఈ సంఘం డబ్బున్నవాళ్ళనే బతకనిస్తుంది — యిష్టం వచ్చినట్టు బతకనిస్తుంది. పైగా బోల్డు బోల్డు గౌరవిస్తుంది కూడాను.


డాక్టర్ కబుర్లు

# పార్కిన్సన్ వ్యాధి

పార్కిన్సన్ వ్యాధిని 'పెరాలిసిస్ ఎజిటాన్స్' అనికూడా అంటారు నిజానికి పెరాలిసిస్ ఉండదు. కండలు బిగుసుపోయి క్రమంగా నశించిపోతాయి. వాటికి వ్యాయామం అవసరం. ఈ రోగం ఉన్నవారు వంగి, చకచక నడుస్తారు.

వ్యాయామం ఎలాగ ఉండాలి? నడిచేటప్పుడు, కాళ్లూ చేతులూ బాగా ఆడించి నడవాలి. వీలయితే నేల మీద పుస్తకాలని అడుగు అడుగు దూరంలో పరిచి వాటిని దాటుకుంటూ నడవాలి.

మెడ, భుజాలు, కాళ్లు,



మోకాళ్లు, మడమలు, కాలివేళ్లు బాగా వ్యాయామానికి లోనవాలి.

(కాపీరయిటు)

# విషవలయం

రవి : హాం...ఈ సంఘం గ్రుడ్డిది అందుకే అలా ప్రవర్తిస్తోంది.

శేఖర్ : నేను 'ఈ నాడు యిలా జరుగుతోంది' అని చెపుతున్నాను గానీ అందుకు కారణాలు కావు. అవి నా కనవసరం. అందుకే సంఘం గౌరవించే విషయాల్నే నేమూ ఆచరించటం మొదలెట్టాను. నేమూ నీమాదిరే కొన్నాళ్ళు నీతి, నియమాలంటూ అఘోరించాను. బ్రదర్! ఆ రోజుల్లో నే పడ్డపాట్లు కుక్కలు కూడా పడుండవ్. అందుకే కాలాను గుణ్యంగా మారాను. ఈ ప్రవాహం వాలులో వడ్డాను. ప్రవాహానికి ఎదురీదటం తెలివైన పనికాదు, తెలివైనవాడి లక్షణమూ కాదు.

రవి : అవును, తెలివైనవాడి లక్షణం కాదు! అవకాశవాదిలా అంతరాత్మను చంపుకుని బ్రతకాలి. ఇదేనా మీ సిద్ధాంతం ?

శేఖర్ : బ్రదర్! యిప్పటికే ఈ నీతి, నిజాయతీలంటే అర్థం తెలియక చస్తున్నాను. వాటికితోడు ఈ అంతరాత్మనికూడా తీసుకురాకు రంగంమీదికి..

రవి : తప్పుచేసేవాడెప్పుడూ నిజాన్ని తప్పించుకు తిరుగుతూ వుంటాడు. మీరూ అంతే.

శేఖర్ : నీతో వాదించే అవసరంగానీ, వోర్పుగానీ నా కిప్పుడు లేవుగానీ— ఒక విషయం మాత్రం నిజం. డబ్బులేని నీతి నియమాలెందుకూ పనికిరావు రవీ! అంతేకాదు, నీతి నియమాలంటూ పట్టుక్కూర్చునేవాడ్దగ్గరికి డబ్బురాదు బ్రదర్! ఇది నాకు జీవితం నేర్పినపాఠం. అందుకే నేనిలా తయారయ్యాను. నన్నింకా గుర్తుపట్టలేదు కదూ? అవును ...మనం కల్సుకుని చాలా ఏళ్ళయ్యింది. నేను రవీ! శేఖరాన్ని!!

రవి : శేఖర్! నువ్వా?! ఏమిటి? ఇక్కడేం చేస్తున్నావ్?!

శేఖర్ : ఉద్యోగం ఏమీలేదు రవీ! కానీ వో పెద్దవ్యాపారం చేస్తున్నాను. విట్లెస్ఫ్ వీళ్ళ వలా నమ్మిస్తున్నాను!... జీవితంలో డబ్బు లేకపోవటంవల్ల వచ్చే అనర్థాలేమిటో తెల్సుకున్నాను. అందుకే ఈ క్లాస్ సొసైటీతో సంబంధాలు పెట్టుకోవాలని తాపత్రయం.

రవి : ఈ సంబంధాలవల్ల నీ కొచ్చే లాభం ఏమిటి శేఖర్? వాళ్ళ దుర్గుణాలు నీకు పట్టుబడతయ్ తప్ప.

శేఖర్ : డబ్బున్నవాళ్ళవి దుర్గుణాలెందుకవుతయ్ రవీ! వాళ్ళవన్నీ మంచి గుణాలే. నువ్వీ డబ్బున్నవాళ్ళ నెన్నయినా తిట్టు. కానీ వాళ్ళంటె నాకు చాలా యిష్టం. ఎందుకో తెల్సా? డబ్బున్న ప్రతివాడూ బ్రతకనేర్చినవాడే, బ్రతకనేర్చిన ప్రతివాడి దగ్గరికే డబ్బొస్తుంది. ఈ ప్రపంచంలో డబ్బున్న ప్రతివాడూ పెద్దమనిషే. ఇలాంటి పెద్దమనుష్యుల్తో భుజాలురాసుకు తిరగాలని నాకు సరదా. రబ్బింగ్ షోల్డర్సు విత్ క్లాస్ పీపుల్ ఈజ్ ఎ ప్లెషర్ ఫర్ మి రవీ! ఈ 'క్లాస్' పీపుల్తో భుజాలురాసుకు తిరగాలనే వాంఛ ఈ ప్రపంచంలో ప్రతివాడికీవుంది నీకు తప్ప.

రవి : హాఁ... నువ్వెవరితో నైతే భుజాలు రాసుకు తిరగాలని చూస్తున్నావో వాళ్ళి సమాజంలో వుండే ప్రతి అవినీతికీ మారుపేర్లు. అందుకే అవినీతి పేర్చెప్పితే భుజాలు తడుముకుంటారు. ఈ ప్రమోదరావునే చూడు. వీడో స్కాండ్రల్, చీట్, సోషల్ పేరసైట్.

శేఖర్ : (వెంటనే అందుకుంటూ) ప్రమోదరావొక స్కాండ్రల్, చీట్, సోషల్ పేరసైట్, రోగ్—నేమూ వొప్పుకుంటాను — అందుకే వాడ్దగ్గిర డబ్బుంది. అందుకే వాడంటె నాకాపేక్ష. ...మొదట్నుంచీ నాదో వింత మనస్తత్వం రవీ! నీకు గుర్తుందా? మనం బెజవాడ కాలేజీలో చదివేటప్పుడు నువ్వు రాసిన నాటకాలు మన కాలేజీలో వేస్తూ వుండేవాళ్ళం. నువ్వూ, రమణమూర్తీ ఎప్పుడూ హీరో వేషం కావాలని పోట్లాడుకునేవాళ్ళు. మాసిన గడ్డం చిరిగిన గుడ్డలు వేసుకునే ఆ హీరో పాత్రంటే మీరెందుకు పడి చచ్చేవాళ్లో నాకర్థం అయ్యేదికాదు. నువ్వలాంటి హీరోల్ని ఎందుకు సృష్టించేవాడివో అంతకంటే అర్థం అయ్యేది కాదు. నన్ను కూడా వేషం వెయ్యమన్నప్పుడు నేనేం చెప్పేవాణ్ణో నీకు గుర్తుందా?

రవి : గుర్తు లేకేం గానీ...అవన్నీ యిప్పుడెందుకు చెపుతున్నావో మాత్రం అర్థం కావటంలేదు.

శేఖర్ : అర్థమవుతుంది రవీ! నా మనస్తత్వం ఎలాంటిదో తెలియచేసేందుకే యివన్నీ గుర్తుచేస్తున్నాను. మీరు నన్ను కూడా వేషం వెయ్యమని అడిగినప్పుడల్లా ఈ ప్రశ్న వేసేవాణ్ణి: 'మీ నాటకంలో ఉలెన్సూటు వేసుకుని, చేతిలో సిగరెట్టుతో జమీందారీ హంగులన్నీ వున్న పాత్రేమన్నా వుందా?' అని. అలాంటిపాత్ర నాటకం మొత్తంమీద ఒక్క నిమిషం వేస్తున్నా నేనదే తీసుకునేవాణ్ణి. జీవితంలో కూడా అలా వుండాలని నా వాంఛ రవీ! డబ్బు లేకపోవటంవల్ల వచ్చే బాధలేమిటో నేను పూర్తిగా అనుభవించాను. అన్నంలేక పస్తులుండి మా అమ్మ దారుణమయిన పరిస్థితుల్లో చచ్చిపోతూ వుంటే చేతిలో కానీ లేని నేను ఏడుస్తూ చూస్తూ కూర్చున్నాను రవీ! అమ్మని నేనే చేతులారా చంపాను రవీ! చంపాను (ఏడుస్తూ అంటాడు).

రవి : ఆఁ... మీ అమ్మగారు చనిపోయారా?

శేఖర్ : అదొక్కటే కాదు బ్రదర్! పెళ్ళీడుకొచ్చిన నా చెల్లెలు రమ పెళ్ళి చెయ్యలేని నా అసమర్థతవల్ల, నాకు గుండెలమీద కుంపటిలా వుండటం యిష్టంలేక ఆత్మహత్య చేసుకుంది...

రవి : (బాధగా శేఖర్ దగ్గరకు వెళ్ళి భుజంమీద చెయ్యివేస్తూ) శేఖర్!

శేఖర్ : నాకు సానుభూతి చూపించొద్దు రవీ! వద్దు...ఈ రెండు సంఘటనలు నా కళ్ళు తెరిపించినయ్. అంతవరకూ ఈ డబ్బున్నవాళ్ళంటే నాకు కసి, ద్వేషం—అందువల్ల నేను బాగుపడిందేమీ లేదు. నా వాళ్ళందర్నీ చంపుకున్నాను ... అప్పటినుంచీ వాళ్ళతో స్నేహాని కు తిరిగేందుకు ప్రయత్నిస్తున్నాను.

రవి : దానివల్ల నీకొచ్చే లాభం ఏమిటి శేఖర్?

శేఖర్: లేకేం రవీ! వాళ్ళది కష్టపడి సంపాదించిన డబ్బుకాదు. చుట్టూ వుండే నాలాంటివాళ్ళమీద యిష్టం వచ్చినట్టు ఖర్చుపెడతారు. అందుకే వాళ్ళతో తిరగ

టింలో లాభం వుంటే. నేనూ — నువ్వూ కల్సి తిరిగితే ఏం లాభం బ్రదర్!... బూడిద...మా బజార్లో వుండే ఓ ఆఫీసర్ని 'హలో! గుడ్‌మార్నింగ్ సర్!' అంటూ దూసుకుపోయి వాడి వెంట తిరిగే వాణ్ణి, అలానే యింకో లాయర్ని, యింకో మార్వాడీని...యిలా...యెందరో... యెందరో తిరిగేవాణ్ణి. క్రూడ్‌గా చెప్పాలంటే 'కాకా' పట్టేవాణ్ణి. కానీ బ్రదర్! 'కాకా' పట్టటానికి నా ఆత్మాభిమానం అడ్డొచ్చేది. ఈ ఆత్మాభిమానం అనేదుంది చూశావ్, యిదీ మిడిల్ క్లాసుకుండే ఓ పెద్ద జబ్బు.

రవి: ఆత్మాభిమానాన్నలా తీసిపారెయ్యకు. ఆత్మాభిమానం లేని మనిషి పశువుతో సమానం.

శేఖర్: రవీ! నీ దారి వేరు, నాది వేరు. అందుకే నీతో వాదించదలుచుకోలేదు. కానీ ఒకటి మాత్రం నిజం. నేను నా ఆత్మాభిమానాన్ని చంపుకోలేకపోయాను. నేనిలా 'కాకా' పడుతూ పైవాళ్లతో తిరిగే రోజుల్లో ఏమయ్యేదో తెల్సా బ్రదర్! ఈ డబ్బున్న వెధవలున్నారే, వీళ్లకో పెద్ద జబ్బుంది. తమకంటె తక్కువ అంతస్థులో వున్నవాళ్లు తమతో తిరుగుతుంటె వాళ్లనెప్పుడూ చిన్న చూపే చూస్తారు. నిచ్చెన మెట్లెక్కుతూ పైకి పోయేవాడెప్పుడూ పై మెట్టువంకే చూస్తాడు, క్రింద మెట్టుని చూడడు. ఆ రోజుల్లో

# విషవలయం

నన్నూ అలాగే చూసేవాళ్లు వారు. నే నెప్పుడూ వెంటపడి తిరిగే వో బిజినెస్ మెన్ అప్పుడప్పుడూ నన్ను వాడి కార్లో ఎక్కించుకునేవాడు. పిచ్చి వెధవని నేను! వాడి ప్రక్కన కార్లో కూర్చునిపోతుంటె నాకు సర్దాగా వుండేది. దార్లో నడచిపోతున్న నా స్నేహితులకి చెయ్యూపుతూ పోతూవుండేవాణ్ణి. కాని యింతాచేసి ఆ వెధవ నన్ను నా యింటి దగ్గిర దించేవాడుకాడు. ఇంటికో నాలుగొందల గజాలు యివతలో అవతలో దింపేవాడు. నా సర్దా అంతా చల్లారిపోయేది. వాడలా యెందుకు చేసేవాడో తెల్సా? వెధవకి నా పెంకుటింటి ముందు కారాపటం నామర్దా, నామోషి.

రవి: శేఖర్! అందుకే అంతస్తుల్ని మరిచి నిచ్చెనెక్కేవాళ్లతో పూసుకు తిరగటం మంచిది కాదు. ఇప్పటికయినా యీ సరదా మానుకో.

శేఖర్: రవీ! యిప్పటి నా అంతస్థు వీళ్లందరి అంతస్తు కంటే పెద్దది. వాళ్లే నాతో పూసుకుతిరుగుతున్నారు. నా కథ సాంతం విను బ్రదర్!...వాడలా యింటికి దూరంగా దించటంతో నా సర్దా అంతా చల్లారిపోయేది. నాక్కోపం వచ్చేది. కానీ జాగ్రత్తగా ఆలోచించాను. ఈ ప్రపంచంలోని ఒక సత్యం నాకు తెల్సింది. కారున్నవాడు కారున్నవాడికే లిఫ్టిస్తాడు. వాడింటిదాకా వెళ్లి కారు డోర్ తనే స్వయంగా తీసి మరీ దించుతాడు. అందుకే యీ 'కాకా' పట్టే వృత్తికి స్వస్తి చెప్పి నేనో పెద్ద బిజినెస్ మేగ్నెట్‌ని వీళ్లందరికీ యిల్యూషన్ కల్పిస్తున్నాను. ఇప్పుడు నా దగ్గిర ఓ డజన్ ప్లిమత్ కార్లు, వో యిరవై డాడ్జిలూ వున్నయ్యని వీళ్ల ఉద్దేశ్యం. కానీ యీ వూరు ప్లేన్‌మీద వొచ్చాను కాబట్టి అవిప్పుడు నా దగ్గిరలేవు. ఈ ప్రమోదరావుగాడు తనకారుని నా కిచ్చేసి నేనీ వూళ్లో వున్నంతకాలం వాడ్డక్కోమని వేడుకొన్నాడు. తను ఆఫీసుకి టాక్సీలో పోతున్నాడు. ఎంబాసిడర్‌కంటే ఎక్కువ ఖరీదైనకారు యివ్వలేనందుకు క్షమాపణకూడా చెప్పుకున్నాడు పిచ్చి వెధవ.


రవి: ఇంతకూ ఈ వూరెందుకొచ్చావ్? ఎన్నాళ్లుంటావ్?

శేఖర్: ఎందుకొచ్చావంటావేమిటి రవీ! ఎంజాయ్‌మెంటుకోసం అదే నా బిజినెస్. ప్రతి సిటీ తిరుగుతూంటాను. నే వెళ్లే ప్రతి సిటీలోనూ ముందుగా సిటీలోని బిగ్ షాట్సందర్నీ పిల్చి వో పార్టీ యిస్తాను. అదే నేనుచేసే ఖర్చు. తర్వాతక్కడ వున్నంతకాలం నే నడక్కుండా వాళ్లే నా క్రింద ఖర్చుపెడతారు. ఆ వూరు విసుగు పుట్టంగానే యింకో వూరికి మకాం మార్చేస్తాను...

రవి: ఇట్లా చెయ్యటం మోసం కాదూ? ఈ పాపం బద్దలయ్యి వాళ్లందరూ కలిసి నిన్ను జైలుకి పంపిస్తారు.

శేఖర్: హహ్హహ్హా ....అంత తెలివి తక్కువగా ప్రవర్తిస్తానా బ్రదర్! వూరు విడిచేలోగా వాళ్ల రహస్యాల్లో కొన్నయినా నాకు చెపుతారు. అదే వాళ్ల వీక్‌నెస్. అదే నాకు పెద్ద ఎసెట్. ఆరహస్య విషయాలన్నిటిలోనూ సహాయం చేస్తానన్చెప్పి వాళ్లచేతే ప్లేన్ టికెట్ కొనిపించి ఆవూరొదిలేస్తాను. వెధవలు నా దగ్గిర్నుంచి జవాబులేక అల్లాడిపోతారుగనీ నా విషయం ఎవ్వరికీ చెప్పరు. ఎందుకోతెల్సా రవీ! అంతా తేలుకుట్టిన దొంగలే. అలాంటివాళ్లనే నేను పట్టుకుంటాను.

రవి: అయినా యిది మోసంకాదూ?



శేఖర్ : అదే చెప్పబోతున్నాను బ్రదర్! ఏమిటి మోసం ? వాళ్ళుచేసే మోసాలో పోలిస్తే, యిదెంత ? వాళ్ళు లక్షలకి లక్షలు అన్యాయంగా సంపాదిస్తారు. అందులో వో యిరవై వేలు నా క్రింద ఖర్చుచేస్తారు. అంతే. వాళ్ళు నా క్రింద ఖర్చు పెట్టేది కష్టార్జితంకాదు బ్రదర్ ! బ్లాక్ మనీ !? అదీగాక నే నడక్కుండానే వాళ్ళు నా క్రింద ఖర్చుపెడతారు. ఇది మోసవా? నేను కష్టార్జితంలో బతికే వాళ్ళ జోలికే పోను, వాళ్ళని రాసుకు తిరిగితే ఏం రాల్తుంది—బూడిద!

రవి: కానీ ఈ ప్రమోదరావు లాంటి విష వలయంలో నువ్వు చిక్కుకునేట్లు చెయ్యగలడు శేఖర్ ! ఎందు కనవసరంగా ఈ బాధలు.

శేఖర్ : ప్రమోదరా వేవిటి ?! నే తిరిగే మనుష్యులందరూ నా చుట్టూ విష వలయాలు సృష్టించగలిగిన పెద్దమనుష్యులే. అయినా నా కలాంటి వాళ్ళమధ్య వుండటం చాలా సంతోషం బ్రదర్. బ్రతుకులంటే వాళ్ళవీ బ్రతుకులు !

రవి: అయినా నీ కెందుకీ సరదాలు ? బి. ఎ. పేసయ్యావు; యేదన్నా వుద్యోగం చూసుకోరాదూ ?

శేఖర్ : ఏం వుద్యోగం బ్రదర్ ! గుమాస్తాగానా ?! అదిమాత్రం యెక్కడ దొరుకుతాం దిప్పుడు ? గుమాస్తా పోస్టుకీ బి. ఏలూ, ఎమ్మేలేగాక యింజనీర్లుకూడా తగలడ్తున్నారు కాంపిటీషనుకి ! అదీగాక చేరెడు నీళ్ళల్లో చేపలు పట్టే అలవాటు కెప్పుడో నే స్వస్తి చెప్పాను. ఈ లక్ష్యూరియస్ బ్రతుక్కలవాటుపడ్డాను. గుమాస్తాగా బతకలేను; జస్ట్ యింపాజిబుల్.

రవి : శేఖర్ ! నీ మంచికోరేవాడ్నిగా చెపుతున్నాను. ఈ ప్రమోదరావుతో ఎక్కువగా తిరగటం నికంత మంచిదికాదు. అన్ని రోజులూ మనవికాదు. [కాస్సేపాలోచించి] అయినా యీ వూరెందుకొచ్చావ్? ప్రమోదరావుకి నీతో ఏవిటి పని?

శేఖర్ : ఈ వూరెందుకొచ్చానో యిందాకే చెప్పాను రవీ! స్నేహితుడివి కాబట్టి నీతో అబద్ధాలు చెప్పలేదు. ఇక పోతే వీళ్ళందరకీ ఏం చెప్పానో తెల్సా!? నేనో పెద్ద బిజినెస్ మేగ్నెట్‌నని. నాకు బోల్డు


గమనిక: ఈ నాటిక ప్రదర్శింపగోరువారు ప్రదర్శనకుముందే రచయితవద్ద మంచి అనుమతిని పొందాలి. రచయిత అడ్రసు :

— యల్. వి. యల్. యన్. శర్మ,


డిపార్టుమెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ మేనేజిమెంటు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు, బెంగుళూరు—12.


టేపు రికార్డరు సదుపాయము లేనివారు యీ క్రింది భాగం వదలి వేయవచ్చును.

"ప్రమో:— అయినా యివన్నీ మావని మీకు ఋజువేమిటి? ఏదో స్నేహితుడు కదా......నుంచి

గోపీ:—నేనే రికార్డు చేశాను; వింటావా?'' వరకు.

# రకరకాల సెక్రటరీ పక్షి



— కోనేటిరావు

ఈ పేరుపెట్టిన వాళ్ళని నిజంగా మెచ్చుకోవచ్చు ఆఫ్రికాలో కనబడే ఈ పక్షి తల మీద, మెడమీద సుమారు 20 నల్లని ఈకల ఉంటాయి. పక్షికి ఉద్రేకం కలిగితే ఇవి పైకి లేస్తాయి ఎంతో ఖిజీగా ఉండే సెక్రటరీ 'ఈక' కలాల్ని [గత శతాబ్దంలో అవి వాడుకలో ఉండేవి] తల పాగాలోకి చెక్కిన రూపం కనబడుతుంది. ఈ ఈకలు ఆఫ్రికాలో కొన్ని తెగలవాళ్ళు తలపాగాల అలంకారానికి ఉపయోగిస్తారు.

ఈ పక్షి సుమారు నాలుగు అడుగుల ఎత్తు ఉంటుంది. కాళ్ళు పొడవుగా ఉండడం వల్ల కొంగలాగా కనబడుతుంది కొంగకి చేపలు మోజు అయితే దీనికి పాములంటే ఇష్టం— విషపాములైనాసరే పాము కనబడగానే దాని చుట్టూ తిరిగి వీలు కలగానే తన రెక్కలు, చాచి వూపుతూ ఉగ్ర రూపందాల్చి, పాదాలతో బలంగా మోది, చంపి, ప్రీతిగా తింటుంది. తనకు ప్రమాదవశాత్తూ కాటుపడకుండా ప్రతిసారీ చాపకచక్యంతో వెనక్కి దూకుతుంది. పాము చచ్చిపోయా తినేటప్పుడు ఎందుకైనా మంచిదని ముందు తలవేపు ప్రారంభిస్తుంది మింగడాన్ని.

శాస్త్రీయంగా దీన్ని సెజిట్టేరియను సర్పెంటేరియను అంటారు. సెజిట్టేరియను అంటే విలుకాడు అని అర్థం. ఈకల అంబుల్పెట్టుకున్న లుకాడిలాగా కనబడుతుంది సర్పెంటేరియను అంటే సర్పాహారి.

ఇది నిజానికి గ్రద్దల విభాగానికి చెందింది. కాని అంత ప్రజ్ఞతో ఎగరదు, ఎగరలేదు కూడా. కాని ఎగిరింది అంటే దాని వ్యవహారం చూడాల్సిందే. విమానంతో దీన్ని పోల్చవచ్చు. రెక్కలు విచ్చుకొని [రెక్కలు విచ్చుకుంటే ఏడడుగుల వెడల్పు ఉంటుంది] విమానంలాగా నేలమీద కొంతదూరం పరిగెత్తి గాలిలోకి పోతుంది. దిగేప్పుడు కూడా అలాగే విమానం దిగినట్టుగానే ముందు కాళ్ళు ఆన్చి కొంత దూరం పరిగెత్తి మరీ ఆగుతుంది.

పాములేగాక, పురుగులు, చిన్న పక్షులు, ఎలకలు కూడా దీనికి ఆహారమే. కంటి చుట్టూ ఈక లుండవు. చుటూ నారింజ వర్ణం ఉంటుంది. చూపు చాలా క్రూరంగా మోసంగా కనబడుతుంది.

గ్రుడ్లు, 2, 3 పెడుతుంది. మగ ఆడ రెండూ పొదుగుతాయి. దీని గూడు దగ్గరే ఒక జాతి పిచ్చుక గూడు కట్టుకొంటుంది. ఆ రెండిటికి ఉండే సహకారం ఏమోకాని, ఈ చిన్న పక్షులకి హాని చెయ్యదు సరికదా రక్షిస్తూ ఉంటుంది సెక్రటరీ పక్షి.

కోల్ మైన్సు, మాంగనీస్ మైన్సు, గోల్డ్ మైన్సు...ఓ...సారీ...గోల్డు మైన్సిప్పుడు గవర్నమెంటు క్రిందనున్నయ్ కదూ? అందుకని గోల్డుమైన్సు నాకు లేవులే. కోల్ మైన్సు, మాంగనీసుమైన్సు వున్నయ్. వీటికిలదు బోల్డుఫాక్టరీలుకూడా వున్నయ్. ఈ వూళ్ళో ఒక ఫాక్టరీ పెట్టాలనొచ్చాను. కొన్నాళ్ళీ వూళ్ళోనండి యీ లొకేషన్ బాగావుందో లేదో చూసి మళ్ళీ అర్జెంటుగా బొంబాయి వెళ్ళిపోవాలి... శోభనాద్రికి మా ప్రోడక్ట్సుకి రీజియనల్ ఏజన్సీ కావాల్ట. కానీ ప్రమోదరావు నావెంటెందుకు తిరుగుతున్నాడో నాకరర్థం కావటంలేదు.

రవి : శేఖర్! నువ్వి క్రేజ్‌లోపడి ఏదో ప్రమాదంలో చిక్కుకుంటావు. ప్రమోదరావు చాలా దుర్మార్గుడు. అతడ్తో చాలాప్రమాదం.

శేఖర్ : దుర్మార్గానికొస్తే నేనేం తీసిపోన్లె...ఇంతవరకూ అలాంటిదేం ఎదుర్వలేదు. ఎదురైతే ఆ థ్రిల్‌కూడా చూస్తాను. అయినా అంతవరకూ రాకుండానే మకాం ఎత్తేస్తాను. నువ్వేం భయపడకు.

( గోపీనాథ్ ప్రవేశం )

శేఖర్: వో...ప్రమోదరావుకొడుకు కొస్తున్నాడు [అని ఏం తెలియనట్లు టేబిల్ మీద పుస్తకం తిరిగేస్తూ వుంటాడు].

గోపీ : రవిగారూ! మీరిక్కడున్నారా? ఇందాకట్నుంచీ మీ కోసం మీ ఆఫీసంతా వెతుకుతున్నాను. వో...శేఖర్ బాబుగారా!! మీరూ యిక్కడున్నారా?! రవిగారూ! ఈయన మీకు తెల్సా? శేఖర్‌బాబుగారని పెద్ద లక్షాధికారి!!

శేఖర్ : నో, నో... లక్షాధికారిని కాదు; కోటీశ్వరుణ్ణి.

గోపీ : తప్పయిపోయింది. మీరు కోటీశ్వరుల్సార్. రవిగారూ! వీరు మన పిక్చర్సుకి ప్రొడ్యూసరు. మా నాన్న నాతో చెప్పాడ్సార్. వీరింటికెవరో చదువుకునే కుర్రదెళ్ళి చదువుకునేందుకు సహాయం చెయ్యండీ అంటే జేబులోంచి రెండు లక్షలిచ్చార్ట రవిగారూ! కోటీశ్వరుడు గదండీ మరి! అందుకని జేబులో లక్షలుంటయ్ మరి. పాపం లక్షాధికారి జేబులో వేలేవుంటయ్ గదా మరి......

నేనిందాక వెళ్ళి 'సార్! సినిమా తియ్యాలనుకుంటున్నాను. ధర్మం చెయ్యండీ' అంటే 'ఫో...యిరవై లక్షలిస్తాను...పిక్చర్తీసి పారెయ్' అన్నారండి.

రవి : ఏఁవిటి? సినిమా తీసేముందే 'ధర్మం' చెయ్యండీ అంటూ బయల్దేరావా? చాలామంది సినిమా తీశాక బయల్దేర్తారే!

గోపీ : మనదంతా నావెల్టీ రవిగారూ! మనం పిక్చర్తీశాకా, తియ్యకముందుకూడా 'ధర్మం' అంటూ బయల్దేర్దాం. మనదంతా నావెల్టీలెండి...వీరు డబ్బిస్తానన్నారని స్క్రిప్టువని చకచకా పూర్తిచేసేస్తున్నాను.

శేఖర్ : ఇంతకూ కదేఁవిటి? నేను ప్రొడ్యూసర్ని గదా? ప్రొడ్యూసరికి కథ చూపించొద్దూ?

గోపీ : రవిగారురాసిన నవలలేదండీ— 'చీడపురుగులు'— అదండి —ఇంతవరకూ మా నాన్న ప్రొడ్యూసర్‌గా వుంటాడేమోనని ఈకథ మానాన్నకి వినిపించాన్సార్. అన్నట్టు మానాన్న దగ్గరా బోల్డు డబ్బుందండి. కానీ మీ దగ్గరున్నంత కాదండి. వో పెద్ద పెట్టెనిండా కట్టలకి కట్టలు డబ్బుందండి. అయినా సినిమా తీస్తానికి మాత్రం డబ్బివ్వడండి, అదేం మనిషో. అయినా మనం ప్రయత్నించాలి గదండీ. సినిమా అంటే మాటలా సార్. బోల్డుమందిని వొప్పించాలి గదా?!

రవి : గోపీ! నాక్కాసిని మంచినీళ్ళు కావాలోయ్.

గోపీ : అబ్బబ్బ ...ప్రొడ్యూసరుగారో మాట్లాడేటప్పుడు అడ్డం రాకండి. మీరేమన్నా హీరోనా యేమన్నానా, వట్టి కవిగారివేకదా! మంచినీళ్ళు యింట్లో వుంటయ్ పోయితెచ్చుకోండి (రవి లోపలికెడతాడు) ఏదో కవిగదా అని లోకువ చేసేశాంగానీ యిదే హీరోఅయితే పరిగెత్తుకెళ్ళి తెచ్చేవాళ్ళం కదూ... అన్నట్టు...ఆఁ... రవిగారికథ మానాన్నకు చూపించానండి. కానీ మానాన్న వొప్పుకోలేదండి

శేఖర్ : ఏం? ఎందు కొప్పుకోలేదు ?

రవి : ఆయనకి పేరు నచ్చలేదుటండి! మొదట 'చీడపురుగులు' అని పెడ్తే కాదన్నాడండి. పోనీ 'విషకుంభాలు' అని పెడ్తానన్నానండి. ఆయనకదీ నచ్చలేదండి. ఏపేరు పెట్టినా తనని గురించే అనుకుంటాడండి.

శేఖర్ : పోనీ 'తేలుకుట్టిన దొంగలు' అని పెట్టండి బాగుంటుంది.

గోపీ : బావుందండి...కానీ కథ తెలియకుండా పేరెట్టా సెలెక్టు చేశారండీ!!

శేఖర్ : (నవ్వుతాడు)

గోపీ : వో ... అవున్లెండి ... పేరు పెడ్తానికి కథ తెలియాల్టెండి... ఏవిటో...సినిమా ఫీల్డులోకి దిగబోతున్నా యింకా యిలాంటి పిచ్చిప్రశ్న లేస్తూ వుంటాను క్షమించండి...మనిషికి పుట్టంగానే వాడిస్వభావం తెల్సుకోకుండానే పేరు పెట్టెయ్యటం లేదూ! ఈసినిమా పేరూ అంతేలెండి ... ఇంతకూ తేలు కుట్టిన దొంగలులో తేలుపోర్షనెవరేస్తారండి?

శేఖర్ : మనుష్యులు వెయ్యరు ... తేలే వేస్తుంది.

గోపీ : వోహో...ఇదిగూడా ఒక నావెల్టీ అన్నమాట, భలే బాగుందిసార్ ... కానీ నిజం తేలువేస్తే డైరెక్టు చెయ్యటం కష్టం అండి. యింకెవడో డైరెక్టు చేస్తే ఫరవాలేదు. ఆ పిక్చరు నేనే డైరెక్టుచెయ్యాలే...ఎట్లా? (ఆలోచించి) పోన్లెండి. నిజంతేలుని కాకుండా వో పెద్ద అట్టతేలుని పెడదాం. చాలా పెద్ద తేలుని పెడదాం సార్. మన జానపద సినిమాలు తీసే వో పెద్ద డైరెక్టరున్నాడ్చూశారూ ...ఆయనాల్లాగా చేద్దాం సార్...ఆయన నా గురువండీ ... ఫర్వాలేదు లెండి? నేను మేనేజ్ చేస్తాగా...

శేఖర్ : ఇంతకూ హీరో ఎవరు పిక్చర్లో ?

గోపీ: దాన్ని గురించే చాలా రోజులాలోచించాన్సార్... మన పద్మశ్రీలకి అయిదేళ్ళదాకా తీరిక లేదట. వాళ్ళు లేకపోతే పిక్చరేం పోతుంది సార్...పోతే పోయిందని ఆ హీరో రోల్ కూడా నేనే వేసేస్తున్నాన్సార్...

శేఖర్: అయితే డైరెక్టరు, హీరో... అన్నీ నువ్వే నన్నమాట! చివరికి ప్రేక్ష

[illegible]

గోపీ: మీరు భలేవారండి...ప్రేక్షకుణ్ణి నేనేవిటి సార్! మీరు భలే హ్యూమరస్‌గా మాట్లాడ్తారే. అయినా మనది ప్రయోజనాత్మక చిత్రం సార్...ప్రేక్షకుడుండడు.

శేఖర్: సరే...నేను కాస్త రెస్టు తీసుకోవాలి...వస్తాను (అని మెట్ల వైపు పోతూ వుండగా)

గోపీ: సార్! ఒక్కక్షణం కూర్చోండి ...నా స్క్రిన్‌ప్లే, డయలాగ్సు చూడండి [అంటూ పట్టుకొచ్చి కూర్చోబెడతాడు].

శేఖర్: అంతా తయారయ్యిందా?

గోపీ: లేదండి. ఒక్క క్లయిమాక్సు సీనుకి మాత్రం అయ్యింది. పిక్చరు మొదలెడితే మిగతావి అవుతాయ్ లెండి.

శేఖర్: క్లయిమాక్సు సీను ఒక్కటే కదా?! ప్రబలికించావ్.

గోపీ: చూడండి సార్. హీరో - అంటే నేను—పశ్చాత్తాపంతో హీరోయిన్ దగ్గర కొస్తాడు. చివరి సీను కదండి. అందుకని పశ్చాత్తాప పడ్తాడు. అంతకు ముందు కొరు కింద పడ్తాళ్లెండి. హీరోయిన్ 'శాంత' యిది (అని టేబిల్‌వంక చూపించి) ...హీరోయిన్ దగ్గరకొచ్చి గుండి పీక్కుంటూ—అంటె—గుండె పట్టుకుని ......'శాంతా! నేను నీచుణ్ణి, ఒకప్పుడు కోపిష్టివాణ్ణి, అప్పుడు నిన్ను బాధ పెట్టాను. ఇప్పుడు పాపిష్టివాణ్ణి, నీ పాదాలు పట్టుకుంటున్నాను', 'కోపిష్టివాణ్ణి—పాపిష్టివాణ్ణి' రైమ్ బాగుందా సార్!

'క్షమించమని అడిగే అర్హత నాకు లేదు. అందుకని అడగను. అయినా క్షమించు శాంతా! శాంతా! నన్ను క్షమించు' అంటాడు. ఇప్పుడు హీరోయిన్ కాళ్ల దెవక్కు లాక్కుని 'హుఁ...మిమ్మల్ని నేను క్షమించటమా?' అంటుంది. ఈ మాటలని చెప్పేపోగుతుంది. తర్వాత ... తర్వాత డయలాగు చెప్పన్సార్.

శేఖర్: అదేవిటోయ్? సిగ్గా!!

గోపీ: సిగ్గు కాదండి... చెపుతాను... కాని వెంటనే చెప్పను. ఇక్కడ సస్పెన్సు... 'హుఁ...మిమ్మల్ని నేను క్షమించడమా?' అంటుంది గదండి! వెంటనే హాల్లోవున్న ఆడవాళ్లు 'అవునమ్మా, ఎందుకు క్షమిస్తుంది? పాపిష్టి వెధవ ఎన్ని కష్టాలు పెట్టాడమ్మా, పాపం! అమ్మా శాంతమ్మా! పాపిష్టి క్షమించకమ్మా' అని అంటూ వుంటారు. వాళ్లనలా అనుకోనిచ్చి మన శాంత యేంచేస్తుందో తెల్సాండి? 'హుఁ ... మిమ్మల్ని నేను క్షమించడమా' అని 'కాదు, మీరే నన్ను క్షమించాలి' అంటుంది. ఎట్టా వుందండి సీను...

శేఖర్ : (ఆవలిస్తూ) బ్రహ్మాండంగా వుంది. మిగతావి కూడా పూర్తిచెయ్. సెట్స్‌మీది కెళ్లిపోదాం...

గోపీ: మనం యిక సెట్సుమీది కెళ్లిపోదాం రవిగారూ!... అబ్బబ్బ...ఈ రవిగారేడి? మహానుభావుడు ... మంచినీళ్లంటూ లోపలే వున్నట్టున్నాడు... (అని బయటకు చూసి కంగారుగా) అయ్య బాబోయ్! మా నాన్నొచ్చేస్తున్నాడు. రవిగార్ని యింటికి రప్పించి కథ్రలాయించటం ఆయనకు నచ్చదు. ఈయనేమో లోపలే కూర్చున్నాడు. అట్నించటు దొడ్డిదారిన పంపించేస్తాను (అని లోపలికి పరుగెత్తుతాడు)

(ప్రమోదరావు, శోభనాద్రి, భజగోవిందం ప్రవేశం)

ప్రమో: (వస్తూనే) శేఖర్‌బాబుగారూ! కొంచెం రెస్టు తీసుకున్నారనుకుంటాను.

శేఖర్: అబ్బే ... లేదండి. అయినా విశ్రాంతి అంటూ గంటలకి గంటలు నిద్రపోవటం నా కలవాటులేదు. రాత్రిళ్లు కూడా నాలుగ్గంటలకంటే యెక్కువ నిద్రపోను. ఐ కాంట్ ఎఫోర్డ్, ఇలా రోజుకి యిరవై గంటలు పన్చేసినా నా బిజినెస్ వ్యవహారాలు తేలవ్. ఏంవిటో బిజీ లైఫ్...

శోభ : అంతేనండి ... అట్టానే వుండాలి ... నేను కూడా ఎన్నికలప్పుడు చాలా బిజీమనిషి నన్నమాటే. ఆ రెండు మూణ్ణెల్లూ మీటింగులుమీద మీటింగులు తెల్లవార్లూ పెట్టేస్తాను. ఎన్నికలయ్యి మళ్లీ ఎన్నిక లొచ్చేదాకా నిద్దరోతాను... ఆ దేవుడూ...ఆడు ... కుంబకర్ణుడిమాదిరన్నమాట (అంటూ నవ్వుతాడు)

ప్రమో: ఆఁ ... మీనుంచి మాకొక సహాయం కావాలని క్లబ్బులో చెప్పాను. ఇప్పుడు వివరంగా చెపుతాను. భజగోవిందం! వీధి తలుపేసిరా (అని తను లోపలికెళ్లి ఒక సూట్‌కేస్ తెస్తాడు... భజగోవిందం వీధి తలుపువేసి వస్తాడు)

మా దగ్గర కొన్ని లక్షల దొంగనోట్లున్నయ్. వాట్ని మార్చటానికి మీ సహాయం కావాలి.

శేఖర్: (కుర్చీలోంచి కంగారుగా లేచి కాస్సాలోచించి) ఈ దొంగనోట్లని మార్చేపని నేను చెయ్యగలననీ, చేస్తాననీ మీ రెందుకనుకున్నారో నా కర్థం కావటం లేదు. దిసీజ్ ఏ క్రయిమ్ ... సీరియస్ క్రయిమ్.

ప్రమో: అహఁ...మీరట్లా మాట్లాడకూడదు. మీ స్నేహితులం మేం. మాకోసం ఈ వుపకారం చేసిపెట్టాలి. పైగా యివి మేం ముద్రించిన నోట్లు కావు. మాకీ పెట్టెరైల్లో దొరికింది. ఈ నోట్ల కట్టలని చూడగానే కాస్త ఆశపుట్టింది. ఏమీ ప్రమాదం లేకుండా మార్చగలిగితే మనకెంతో డబ్బువస్తుంది. ఆ ఆశవల్లే యింతకాలం వీట్ని దగ్గరుంచుకున్నాం...

శోభ : అయినా నాకు తెలియకడుగుతా...ఏంటేంటో కబుర్లు చెప్పేసినావ్ గానీ ఊహా కొత్త పని చెయ్యలేం, 'మా బజగోవిందవే కొన్ని నోట్లు మార్చాడే ... అదేదో ముతకసామెత చెప్పినట్టు ఆడే నయం లాగుందే నీకంటే. ఏం బజగోవిందం?!

భజ : అ!...అవునండి...వొ వంద పదిరూపాయల కాగితాల్ని నేనే మెల్లగా మార్చానండి. కానీ వో తడవ వో కొట్టుకెడితే వాడీనోటు తీసుకుని తిరగేసీ, బోర్లేసి శల్య పరీక్ష చేశాడండి. దాంతో నాకు వొణుకు పుట్టుకొచ్చిందండి. ఆ కొట్టువాడో వెధవ గనక సరిపోయిందిగానీ అదే ఏ బ్యాంకువాడో అయితే నామెడకి వురివేసేవాళ్లు గదండి. కానీ ప్రమోదరావుగారు నాకు తండ్రిలాంటి వారు కాబట్టి వార్చెప్పినట్టు వో వందనోట్లు మార్చాను...తర్వాత భయమేసిందండి.

ప్రమో : నాక్కూడా యిలా చిల్లరగా మార్పించటం మంచిది కాదనిపించిందండి అదిగాక వాడెవడోగానీ ఏడెనిమిదిలక్షల్దాకా అచ్చుగుద్దాడండి ... ఇప్పుడనుకువేదేంవిటంటే దేశం నాలుగుమూలలకీ వీట్ని చేరేసి సరిగ్గా ఒకేరోజున వీట్ని మార్కెట్టులోకి తోసెయ్యాలి, ఎవడన్నా అనుమానించేలోగానే మన డబ్బు మన చేతికొస్తుంది. ఏ వంటారు? దేశంలో నాలుగుమూలలకీ చేరవేసే బాధ్యత నేనూ, శోభనాద్రీ తీసుకుంటాం. మీతో

ప్రదేశాల్లో వ్యాపారాలున్నయ్ కాబట్టి మీరు వాట్నక్కడ మార్చాలి.

శోభ : అసలీ మార్చటం కూడా నేనే చేసేయగల్ను కానీ ప్రమోదరావుకే ధైర్యం చిక్కటంలేదు. మీరేమో బెట్టు చేస్తున్నారు.

శేఖర్ : అబ్బె...బెట్టు చెయ్యటం కాదు నేను చెయ్యదల్చుకుంటే చేసి పారెయ్యగలను! కానీ...

ప్రమో : ప్రతిఫలం విషయం ఆలోచిస్తున్నారా?

భజ : (శేఖర్‌బాబు దగ్గరకెళ్లి) ఈ విషయంలో ప్రమోద రావుగార్నేం అనుమానించకండి. ఎందుకూ నేనో సంగతి చెపుతాను వినండి...నేనో అయిదొందలు లంచంపట్టి వారికిస్తే! భజ గోవిందం! పిల్లలు గలవాడివి. ఈ రెండొందలూ వుంచుకో అని నాకిస్తారు. అహా... మీకు పిల్లలున్నారో లేదో తెలియదనుకోండి, అయినా మీ వాటా మీ కిస్తారు.

శేఖర్ : హహ్హహ్హా నాకు ప్రతిఫలం యివ్వటం గూర్చి ఆలోచిస్తున్నారా? (నవ్వుతూ) మీరిందులో వున్న యెనిమిది లక్షలు నాకిచ్చినా నాపాకెట్ ఎక్స్‌పెన్సెస్‌కి సరిపోవు. అందుకే మీరు నాకేం యివ్వనక్కర్లేదు, ఫ్రెండ్‌గా మీకీ సహాయం చేస్తాను. నాకీ దేశంలో వున్న వ్యాపార స్థావరాలన్నీ మీరీ డబ్బుని మార్చేందుకు వుపయోగించుకోవచ్చు నేను మాత్రం పర్సనల్‌గా ఏమీ చెయ్యను. ఎందుకంటె యిలాంటివి చెయ్యటం నేరం. అదీగాక అఫ్టరాల్ ఎనిమిది లక్షలకి నేను కూడా దిగటం మెందుకు? ...ఏవీ...ముందీ నోట్లని చూడనివ్వండి [అని పెట్టె తెరచి ఒక నోట్లకట్ట తీసి] బాగానే వున్నయ్...అన్నీ పదిరూపాయల నోట్లన్నమాట.

ప్రమో : అవునండి.

శేఖర్ : (కాస్సేపు చూసి) కానీ యీ నోట్లల్లో ఎక్కడో ఏదో వెలితిగా వుంది. చూద్దాం వుండండి. (అని తన జేబు లోంచొక పది రూపాయల నోటుతీసి)... యిదిగో...అసల్దానికి, వీటికీ యిక్కడ... యిక్కడ భేదంవుంది. లాభం లేదు. వీట్ని కొంత మారిస్తేగానీ మనం మార్చలేం. వాట్ని సరిదిద్దటం యీ నోట్లుకొట్టిన వాళ్లే చెయ్యగలరు వాళ్ల దగ్గిరే ఆసామాగ్రి వుంటుంది. సారీ! యివి మీకేం వుపయోగం లేదు. ప్రాణాలమీదికి రాకముందే వీట్నన్నిటినీ కాల్చి పారెయ్యండి. (అని పెట్టె మూసివేస్తాడు. ప్రమోద రావు, శోభనాద్రీ, భజగోవిందం ఒకళ్ల మొహాలు వకళ్లు చూసుకుంటారు).

శోభ : అయితే ... ముద్దర కొట్టే సామాన్లుంటే తప్ప వీట్ని మార్చలేవా?

శేఖర్ : అవును. ఆ సామాగ్రివుంటే నేనే చేసిపారెయ్యగల్ను...మనం యెవరి దగ్గరకో వెళ్లక్కర్లేదు.

శోభ : ఇందాకా వచ్చాక యింకా రహస్యాలేంటి ప్రమోదం, చెప్పెయ్.

భజ : అవునండీ చెప్పెయ్యండి.

ప్రమో : శేఖర్ బాబుగారూ! క్షమించండి. మీతో అబద్ధం చెప్పాను. కానీ యిన్ని లక్షలు వృధాగా పారేసుకోలేం చూడండి...యివి ముద్రించింది మేమే... నేనూ, శోభనాద్రీ.

భజ : నేనూ కొంచెం సహాయం చేశానండీ...వో లక్ష రూపాయల సహాయం.

శోభ: వోయ్ బజగోవిందం! నీది లచ్చ రూపాయల సహాయమా? నీది లచ్చ రూపాయల సహాయవయితే నాది నాలుగు లచ్చల సహాయం...ఆc.

ప్రమో : మీరూరుకోండోయ్...యివన్నీ మార్చాక అందరికీ అనుకున్నట్టుగానే యిస్తాను. శేఖర్‌బాబుగారూ! మాదగ్గిర ఆ సామాగ్రి అంతా వుంది. చేసే మార్పులు చేసెయ్యండి.

శేఖర్ : వో. కె. రేపు మొదలెడ్దాం. నేనలా బయటకెళ్లొస్తాను. అర్జంటుగా మా ఢిల్లీ బ్రాంచికో టెలిగ్రాం యివ్వాలి [ అని తన సూట్‌కేసు తీసుకుంటాడు.)

ప్రమో : క్షమించండి శేఖర్‌గారూ! మీరీ మార్పులు చేసేటంతవరకూ యీ యిల్లుదాటి బయటకు వెళ్లకూడదు.

శేఖర్ : నిర్బంధమా?


ప్రమో : అలా అనకండి. మా జాగ్రత్తలో మేం వుండాలి కదా. ఇంతవరకూ ఈ రహస్యం మా ముగ్గురికీ తప్ప యింకెవ్వరికి తెలియదు. ఇప్పుడు మీకు తెలిసింది. మీరు రేపు ఈ నోట్లని సరి చేసేటప్పుడు సామాగ్రితోసహా మీ ఫొటో తీసుకుంటాం. అంతవరకూ మీకీ నిర్బంధం తప్పదు. మీరు నన్ను క్షమించాలి.

శేఖర్ : ఒకవేళ యిప్పుడే నేను పోలీసులకి ఫోన్ చేస్తే...

ప్రమో : (నవ్వి శోభనాద్రి వంక చూస్తాడు)

శోభ : పేణాలమీద ఆశవుంటే ఆపని చెయ్యవ్...

శేఖర్ : ఇదన్నమాట మీ వన్నాగం (నవ్వి) ఫరవాలేదు. ఆ మాత్రం జాగ్రత్తలో వున్నారు. ఇలాంటి పన్లకి జాగ్రత్త చాలా అవసరం. మీరు మీ జాగ్రత్తలో వున్నారో లేదో తెలుసుకునేందుకే ఈ ప్రశ్నలు వేశాను. యు ఆర్ పర్‌ఫెక్ట్లీ కేర్‌ఫుల్.



ప్రమో: ఆఁ...మీరొకసారి ఆసామాగ్రి చూడండి. తెస్తానుండండి... భజగోవిందం! ఆ తలుపుదగ్గరేవుండు (అని వీధి తలుపు వైపు చూపించి లోపలి కెడ్తాడు)

[లోపల్నుంచి 'ప్రమోదరావ్! పారిపోటానికి ప్రయత్నించకు, నడు బయటకి' అన్న కేకలు వినిపిస్తయ్]

శేఖర్ : [కంగారుగా] ఏఁవిటది?

శోభ : ఏంలేదు శేఖర్‌బాబూ! వోయ్ బజగోవిందర! ఏఁవిటా వాణుకుడు ? ఆ అర్చేది గోపీ. ప్రమోదం కొడుకు. సినిమాలో డిటెక్టివ్‌లాగా వాళ్ల నాన్నని అప్పుడప్పుడూ బెదరగొడుతూ వుంటాడు అంతే ... వోయ్ గోపీ! ఈ నోట్లన్నీ మార్చేక సినిమా తీద్దుగాన్లే బాబూ... మీ నాన్నివ్వకపోయినా నే నిత్తాలే డబ్బు. (నవ్వుతాడు)

శేఖర్ : 'రుమాలోత్త మొహం తుడుచుకుంటూ' అమ్మయ్య అంతే కదా!

(లోపల్నుంచి ప్రమోదరావు, వెనక రివాల్వరు పట్టుకుని రవి, గోపీనాథ్ ప్రవేశం)

రవి : శోభ నాద్రీ భజగోవిందం... యు ఆర్ అండర్ అరెస్టు...

శోభ : వోయ్ గుమాత్తా రవివి కాదూ! ఏంటి మాట్టాడుత్నావ్? లాగి లెంపకాయ కొడతాను, ఏబెహ

రవి : షటప్ ! ఐయామ్ రవికుమార్ ఫ్రం సి. ఐ. డి.

ప్రమో : అయినా యివన్నీ మావని మీకు ఋజువేమిటి? ఏదో స్నేహితుడు కదా అని ఈ శేఖర్ని యింటికి పిలిస్తే యివన్నీ అతనే తెచ్చాడు. మాకేం తెలియదు.

గోపీ : నాన్నా! ఆ పప్పులేం వుడకవ్? ఇదిగో మన టేపురికార్డర్ మీదే మీరన్నవన్నీ నేనే రికార్డుచేసాను వింటావా అని రికార్డర్ ఆన్ చేస్తాడు. 'శేఖర్ బాబుగారూ క్షమించండి! మీతో అబద్ధం చెప్పాను. కానీ యిన్ని లక్షలు వృధాగా పారేసుకోలేం చూడండి...యివి ముద్రించింది మేమే—నేనూ, శోభనాద్రీ' అన్న ప్రమోదరావు మాటలు వినిపిస్తయ్ రవి గోపీతో ఆపమన్నట్టు సంజ్ఞ చేస్తాడు. ప్రమోదరావు తల వంచుకుంటాడు]

రవి: రెండు నెలల క్రితం యీ వూళ్లో దొంగనోట్లు కనిపించినయ్. ఈవూరొచ్చి ప్రమోదరావు ఆఫీసులో క్లర్క్‌గా చేరి నా ఇన్వెస్టిగేషన్ ప్రారంభించాను. గోపీనాథ్ నేనో రచయిత ననుకున్నాడు. నాతో తిరుగుతూ అమాయకంగా 'మా యింట్లో బోల్డు నోట్ల కట్టలున్నయ్' అనేవాడు. అప్పట్నుంచే ప్రమోదరావ్ యింటిమీదొక కన్ను వుంచాను. నోట్ల కట్టలున్న యీ పెట్టె సంగతి యెప్పుడో తెలిసింది. కానీ సామాగ్రి యెక్కడుందో తెలియలేదు. ఈ వ్యవహారంలో భాగం వున్న మిగతావాళ్లెవరో కూడా తెలియలేదు. అందుకే యింతవరకూ ఏక్షన్ తీసుకునేందుకు వీలుపడ్లేదు. శేఖర్ యీ వూరు రావటంతో మీ వ్యాపారానికి చలనం, నా సమస్యకి పరిష్కారం లభించాయి. శేఖర్ యెవరో కోటీశ్వరుడనుకుంటున్నారు కదూ ?

శేఖర్: రవీ! నా గురించేం చెప్పకు. ప్లీజ్.

రవి: ఆగు శేఖర్! పేదరికాన్ని తెలియజెప్పకోవటంలో సిగ్గుపడాల్సిందేమీలేదు. సిగ్గుపడాల్సింది యిలాంటి అవినీతి పరులు, సంఘద్రోహులు. ఈ శేఖర్ ఎవరో వినండి. ఇతడు రేపెలా గడుస్తుందా అని భయపడే మామూలు మనిషి. కానీ చాలామందికున్నట్టే మీలాంటి డబ్బున్నవాళ్లతో తిరగాలనే 'క్రేజ్' ఇతనికీ వుంది. ఆర్థికంగా నిచ్చెన పైమెట్టులో వున్న మీలాంటివ్యక్తులతో తిరుగుతూ తనూ స్టేటస్ పెంచుకోవాలనుకున్నాడు. ఇలాంటి జబ్బు ఈ ప్రపంచంలో చాలామందికుంది. కానీ నిచ్చెన పైమెట్టుమీద వుండే చాలామంది వ్యక్తుల నిజ స్వరూపాలందరకూ తెలియవ్! శేఖర్ యీ 'క్రేజ్' వల్లే మీరు సృష్టించిన విషవలయంలో చిక్కుకున్నాడు. కానీ మీలాంటి వాళ్లుచేసే దురాగతాలు చెయ్యలేదు, అందుకే యీ నోట్లు సరిచెయ్యటం విషయాన్ని రేపటికి వాయిదా వేశాడు. నేనిప్పుడు రాకపోతే శేఖర్ రేపీపాటికీ వూరునుంచి మకాం యెత్తేసేవాడు. రేపట్లోగా మీనుంచి తప్పించుకుని పోలేకపోతే మీరు సృష్టించిన విషవలయంలో చిక్కుకుని డబ్బున్నవాళ్లతో తిరగాలనే తన 'క్రేజ్' కి ఆహుతి అయ్యేవాడు. శేఖర్‌లాంటి వ్యక్తులందరికీ అతని అనుభవం ఒకపాఠం నేర్పుతుంది, శేఖర్! నిన్ను మొదటే గుర్తుపట్టాను; కానీ నీకు కూడా దీంట్లో భాగం వున్నదేమోనన్న అనుమానంతో నిన్ను గుర్తుపట్టనట్టు నటించి నిన్ను వెంటాడుదామనుకున్నాను. ఏమయినా యీ కేసులో నీతో నాకు పనివుంది. నువ్వెక్కడికీ వెళ్లకు.

శేఖర్: రవీ! నేనో డబ్బులేనివాణ్నని తెలియంగానే వీళ్లెలా చూస్తున్నారో చూడు ఆ చూపులు నేను భరించలేను రవీ! ఇంతవరకూ నా పాదాలు పట్టుకునేందుక్కూడా సిద్ధపడ్డ వెధవలు యిప్పుడు నేనంటే ఎంత నిర్లక్ష్యంగా చూస్తున్నారో చూడు. నే నా నిర్లక్ష్యాన్ని భరించలేను రవీ! నువ్వు నా బ్యాక్‌గ్రౌండ్ వీళ్లతో చెప్పకుండా నన్నుకూడా వీళ్లతో కలిపి ఈ క్రయిమ్‌లో భాగం వుందని కోటీశ్వరుడుగా జైలుకి పంపితే యెంతో సంతోషించేవాణ్ని. హుఁ...నా సంతోషం అంతా పాడ్చేశావ్ రవీ! ఆ సూట్‌కేస్‌లో నా అడ్రసుంది. వాతో అవసరం వున్నప్పుడు పిలుస్తే వస్తాను. డబ్బులేనివాడిగా వీళ్లముందు యింకొక్కక్షణం కూడా నిలబడలేను (అని వీధివేపు భారంగా అడుగులు వేస్తూ వెళ్లి ఒక్కక్షణం ఆగి, పై బిగించుకుని వెనక్కి తిరిగి ప్రమోదరావు, శోభనాద్రుల దగ్గరకొచ్చి)

జెంటిల్‌మెన్! ఈ రెండు నిమిషాల్లో రవి చెప్పిందంతా మరచిపోండి. నేను కోటీశ్వరుణ్ణే! నమ్మండి!!నమ్మరూ?... రోజుకు యిరవైగంటలు పన్చేసినా నా బిజినెస్ వ్యవహారాలు తేలవ్. ఏఁవిటో బిజీలైఫ్...నేను కోటీశ్వరుణ్ణే నమ్మండి, నమ్మండి (పిచ్చిగా నవ్వుతూ వెళ్లిపోతాడు)

భజ: అయ్య బాబోయ్ ! యిందులో యింతమోసం వుందనుకోలేదు. ఏదో పై ఆఫీసరుగదా అని యింటికొచ్చాను. ఇంకా నయం... వస్తానండి (అని రవికుమార్‌కు దండంపెట్టి వెళ్లబోతూ వుంటాడు)

గోపీ: [అడ్డంవచ్చి] ఎక్కడికి పోతావ్? నువ్వు లక్షరూపాయల సహాయం చేశావ్ కదూ? వాటా తీసుకోవూ?'

రవి: నాకీ యిన్వెస్టిగేషన్లో చాలా హెల్పు చేశావ్ గోపీనాథ్...థాంక్సు (అని మిగతా ముగ్గురి వైపు తిరిగి) ఊఁ... పదండి.

( తెర ) ●